



# EVENING EDITION

నేటి దినపత్రిక


సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
31 మే 2024
పేజీలు: 02


# 45 గంటలు సుదీర్ఘ ధ్యానంలో పీఎం మోడీ

తమిళనాడులోని కన్యాకుమారిలో వెలసిన స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం సాయంత్రం నుంచి సుదీర్ఘ ధ్యానంలో కూర్చున్నారు. 45 గంటలపాటు ఈ మెడిటేషన్ చేయనున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గురువారం సాయంత్రం 6.45 గంటల సమయంలో మోదీ ధ్యానం ప్రారంభించారు. ఈ సమయంలో ఆయన కేవలం ద్రవాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం అందులో భాగంగా ఉంటాయని పేర్కొన్నాయి. ఈ సమయంలో ఆయన మౌనంగా ఉంటారని, మెడిటేషన్ హాల్ నుంచి బయటకు రారని తెలిపాయి. ఈ క్రమంలో ఆయన కాషాయ దుస్తులు ధరించి, ధ్యానంలో కూర్చొని ఉన్న కొన్ని దృశ్యాలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం ఆ ఫొటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ.. తమిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.



# గం గం గణేశా రివ్యూ

ఆనంద్ దేవరకొండ హీరోగా వచ్చిన సినిమా 'గం గం గణేశా'. ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యూయల్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మరి ఈ సినిమా ఈ రోజు రిలీజ్ అయ్యింది. మరి ఈ సినిమా ఎలా ఉందో సమీక్షలోకి వెళ్లి చూద్దాం. గణేశ్ (ఆనంద్ దేవరకొండ) ఓ అనాథ. తన ఫ్రెండ్ (జబర్దస్త్ ఇమాన్యూయల్)తో కలిసి చిన్న చిన్న దొంగతనాలు చేస్తుంటాడు. అటు శ్రుతి (నయన్ సారిక)తో బాగా డీప్ గా ప్రేమలో ఉంటాడు. ఐతే, శ్రుతి మాత్రం తనకు బెటర్ ఆప్షన్ దొరకగానే గణేశ్ కి హ్యాండ్ ఇస్తోంది. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో గణేశ్ ఓ డైమండ్ దొంగతనం చేస్తాడు. ఆ డైమండ్ కోసం గణేశ్ ఏం చేశాడు ?, అసలు ఆ డైమండ్ ముంబై నుంచి తెస్తున్న గణేశ్ విగ్రహంలోకి ఎలా వెళ్ళింది ?, మరో వైపు అదే గణేశ్ విగ్రహంలోకి 100 కోట్లు ఎలా వచ్చాయి ?, అసలు ఆ వంద కోట్లు ఎవరవి ?, ఇంతకీ.. గణేశ్ లైఫ్ లోకి నీలవేణి (ప్రగతి శ్రీవాస్తవ) ఎలా వచ్చింది ?, చివరకు గణేశ్ లైఫ్ ఎలాంటి మలుపులు తీసుకుంది? అనేది మిగిలిన కథ.

ఈ సినిమాలో ప్రధాన పాత్ర అయిన గణేశ్ పాత్ర.. ఆ పాత్రకు సంబంధించిన డైమండ్ ట్రాక్.. అలాగే మరోవైపు వంద కోట్లు ట్రాక్.. ఆ ట్రాక్ తో ముడి పడిన మిగిలిన పాత్రలు.. ఆ పాత్రల తాలూకు పాయింట్ ఆఫ్ వ్యూస్.. ఇలా మొత్తానికి "గం గం గణేశా" సినిమా కొన్ని చోట్ల ఆకట్టుకుంది. ముఖ్యంగా కామెడీ టోన్ తో సాగే కొన్ని సస్పెన్స్ సీన్స్ అండ్ ట్విస్ట్ లు అండ్ ఎమోషన్స్ వంటివి సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇక ఈ సినిమాలో హీరోగా నటించిన ఆనంద్ దేవరకొండ తన పాత్రకు తగ్గట్లు చాలా బాగా నటించాడు. తన లుక్స్ అండ్ ఫిజిక్ బాగా మెయింటైన్ చేశాడు. తన రియలిస్టిక్ యాక్టింగ్ తో ఆకట్టుకుంటూ సినిమాకే హైలెట్ గా నిలిచాడు. అలాగే, హీరోయిన్ పాత్రలో నటించిన ప్రగతి శ్రీవాస్తవ కూడా చాలా బాగా నటించింది. ఆమె హావ భావాలు కూడా బాగానే అలరించాయి. అలాగే మరో




హీరోయిన్ పాత్రలో కనిపించిన నయన్ సారిక నటన కూడా ఆకట్టుకుంది. వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యూయల్ కామెడీ పర్వాలేదు. ఇక మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగానే నటించారు.

'గం గం గణేశా' సినిమాలో స్టోరీ పాయింట్ అలాగే ట్రీట్మెంట్ బాగున్నా.. పెద్దగా కథ లేకపోవడం కథనం కూడా రెగ్యూలర్ గానే సాగడం ఈ సినిమాకి మైనస్ అయ్యాయి. అదేవిదంగా ప్రధానంగా ఈ చిత్రంలో ప్రస్తావించిన కొన్ని అంశాలు చాలా సినిమాటిక్ గా అనిపిస్తాయి. దీనికితోడు కొన్ని సన్నివేశాలు బాగా స్లోగా సాగడం, అలాగే మెయిన్ కాన్ ఫ్లిక్ట్ ని క్లారిటీగా ఎలివేట్ చేయకుండా పూర్తి సస్పెన్స్ పాయింటాఫ్ వ్యూలో స్క్రీన్ ప్లేని సాగతీయడంతో.. మెయిన్ క్యారెక్టర్స్ సరిగ్గా కనెక్ట్ కాకపోవడం వంటి అంశాలు కనెక్ట్ కావు.

అయితే దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి దర్శకత్వ పనితనం సినిమా పై ఆసక్తిని కలిగించినప్పటికీ... అదే విధంగా ఆయన రాసుకున్న కాన్సెప్ట్, కొన్ని సన్నివేశాలు మరియు క్లైమాక్స్ సీన్స్ బాగున్నప్పటికీ.. కథ కథనాలను కూడా ఇంకా బెటర్ రాసుకుని ఉండి ఉంటే బాగుండేది. ఇక కొన్ని సీన్స్ సరిగ్గా ఎమోషనల్ గా కనెక్ట్ అవ్వవు. మొత్తానికి దర్శకుడు సినిమాని ఇంట్రెస్టింగ్ గా మొదలు పెట్టి.. ఆ తర్వాత అనవసరమైన సీన్స్ తో కథను డైవర్ట్ చేశాడు. సినిమాలో దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి చెప్పాలనుకున్న కంటెంట్ బాగున్నా.. కథ కథనాలు ఆసక్తికరమైన ఫ్లోతో సాగలేదు. ఇక సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ సమకూర్చిన పాటలు బాగున్నాయి. ఆదిత్య జవ్వాది సినిమాటోగ్రఫీ విషయానికి వస్తే.. లొకేషన్స్ అన్ని న్యాచురల్ విజువల్స్ తో ఆకట్టుకోగా.. ఆదిత్య జవ్వాది వాటిని తెరకెక్కించిన విధానం కూడా ఆకట్టుకుంది. ఎడిటింగ్ బాగుంది. ఈ చిత్ర నిర్మాతలు కేదర్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి పాటించిన నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి.

"గం గం గణేశా" అంటూ వచ్చిన ఈ క్రైమ్ కామెడీ సస్పెన్స్ డ్రామాలో కొన్ని సీన్స్ ఆకట్టుకున్నా... సినిమా మాత్రం మెప్పించలేకపోయింది. అయితే, ఆనంద్ దేవరకొండ నటన అండ్ కథలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, మరియు క్లైమాక్స్ బాగున్నా.., కథ కథనాలు స్లోగా సాగడం, సెకండ్ హాఫ్ లో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ మిస్ అవ్వడం, అనవసరమైన సన్నివేశాలతో సినిమాని నింపడం వంటి అంశాలు సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలిచాయి. ఓవరాల్ గా ఈ సినిమాలోని కొన్ని ఫన్ ఎలిమెంట్స్ కనెక్ట్ అయినా, సినిమా మాత్రం కనెక్ట్ కాదు.



## దోస్త్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) రిజిస్ట్రేషన్ గడువును జూన్ 1 వరకు పొడిగించినట్లు కన్వీనర్ ఆచార్య ఆర్. లింబాద్రి వెల్లడించారు. విద్యార్థులు జూన్ 2 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దోస్త్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారన్న సంగతి తెలిసిందే.



## వైసీపీ గెలిచే సీట్లు ఇన్నే.. తేల్చి చెప్పిన వేణుస్వామి

ఏపీకి మరోసారి జగనే సీఎం అవుతారని ప్రముఖ జ్యోతిష్యుడు వేణు స్వామి పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. 79 సీట్లలో వైసీపీ వన్‌సైడ్‌గా గెలుస్తుందని, 30 నుంచి 40 సీట్లలో టఫ్ ఫైట్ ఉందని వేణు స్వామి తెలిపారు. 95-125 సీట్ల వరకు వైసీపీ విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని వేణు స్వామి చెప్పుకొచ్చారు.



## పడి లేచిన కెరటం రిషభ్ పంత్!

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ పడి లేచిన కెరటంలా దూసుకెళ్తున్నారు. రోడ్డు ప్రమాదం బారిన పడి దాదాపు ఏడాదిన్నర తర్వాత క్రికెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చారు. ఐపీఎల్‌లో ఢిల్లీ తరఫున అదరగొట్టారు. అదే సమయంలో టీ20 వరల్డ్ కప్ కోసం భారత జట్టులోకి ఎంపికయ్యారు. దాదాపు 8 మంది వికెట్ కీపర్లు పోటీలో ఉన్నా సెలక్టర్లు పంత్ వైపు మొగ్గు చూపారు.

# గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి రివ్యూ

మాస్ కా దాస్ విశ్వక్‌సేన, నేహాశెట్టి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య డైరెక్షన్‌లో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ మూవీ నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చింది. ఈ మూవీలో రాజోలు భామ అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. గోపరాజు రమణ కీలక పాత్రలో నటించారు.

ఇంతకీ కథ ఏంటంటే..?

లంకల రత్న (విశ్వక్‌సేన్), స్టోరీ ఇంట్రడక్షన్ తర్వాత రత్నమాలగా అంజలి ఎంట్రీ ఇస్తుంది. విశ్వక్‌సేన్, అంజలి మధ్య కొన్ని సన్నివేశాల తర్వాత అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఇంటెన్స్ ఫైట్ సాగుతుంది. భవిష్యత్ కోసం పెద్ద ప్లాన్ వేసిన విశ్వక్‌సేన్ ఎమ్మెల్యే దొరసామి రాజు (గోపరాజు రమణ) టీంలో జాయిన్ అవుతాడు. అనంతరం నేహాశెట్టి ఊళ్లో గొప్ప పేరున్న నానాజీ కూతురు (నాజర్) బుజ్జిగా అందరికీ పరిచయమవుతుంది.

ఎమ్మెల్యే టైగర్ రత్నాకర్‌గా..

కొంత కామెడీ ట్రాక్ తర్వాత విశ్వక్‌సేన్, నేహాశెట్టి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు.. ఇద్దరి మధ్య ప్రేమను హైలెట్ చేస్తూ మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే సుట్టంలా సూసి చార్ట్ బస్టర్ సాంగ్ వస్తుంది. ఆసక్తికరంగా విశ్వక్‌సేన్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడం, ఎమ్మెల్యే అవడంతో లంకల రత్నాకర్ కాస్తా టైగర్ రత్నాకర్‌గా మారిపోతాడు. తదనంతరం కథలో షాకింగ్ ట్విస్ట్ బయటపడటంతో పోలీస్ స్టేషన్‌లో ఇంటెన్స్ యాక్షన్ పార్టు.. మరో ట్విస్ట్‌తో విరామం పడుతుంది.

డార్క్, ఎక్సయిటింగ్, మాస్ ఎలిమెంట్స్‌తో విశ్వక్‌సేన్ మాస్ అప్పియరెన్స్ తో సాగుతుంది. అంజలి , నేహా శెట్టి పాత్రలు ఒకే అనిపించేలా ఉంటాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. . మొత్తంగా ఫస్ట్ హాఫ్ బోరింగ్ లేకుండా సాగుతుందని ఇప్పటివరకు వచ్చిన కామెంట్స్ చెబుతున్నాయి.





సెకండాఫ్‌లో.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో సాయికుమార్ గెద్దరాజుగా పరిచయం అవుతాడు. విలేజ్ చుట్టూ తిరిగే రాజకీయాలతో కూడిన సన్నివేశాలుంటాయి.

విశ్వక్‌సేన్ కొత్త ప్రయాణంలో ఎదుర్కొనే సవాళ్లు, ట్రాన్స్‌ఫార్మేషన్‌ను హైలెట్ చేస్తూ.. భవిష్యత్ బాగుండాలంటే తన ప్రవర్తన మార్చుకోవాలని నేహాశెట్టి విశ్వక్‌సేన్‌ను హెచ్చరిస్తుంది. కొన్ని నాటకీయ పరిణామాల తర్వాత అయేషా ఖాన్‌తో మోత స్పెషల్ సాంగ్ వస్తుంది. సాగతీతగా అనిపించే కథనం, నిదానంగా సాగే సీన్లతో ఫస్ట్ హాఫ్‌తో సెకండాఫ్ పోలిస్తే డల్‌గా అనిపించగా.. అదిరిపోయే ఫైట్స్‌లో విశ్వక్‌సేన్ ఊరమాస్ సంభవాన్ని చూడొచ్చని అంటున్నారు నెటిజన్లు. మరి మాస్ కా దాస్ తాజా సినిమా కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయనేది తెలియాల్సి ఉంది.

# భజే వాయు వేగం రివ్యూ

ఈ వేసవి అంతా తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో సరైన సినిమా పడలేదు. అలాంటిది ఈ వారం ఏకంగా మూడు తెలుగు మూవీస్ రిలీజ్ అయ్యాయి. వాటిలో అందరి దృష్టి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' పైనే ఉంది. కానీ యూవీ క్రియేషన్స్ తీసిన 'భజే వాయువేగం' కూడా ఓ మాదిరి అంచనాలతో ప్రేక్షకుల ముందుకొచ్చేసింది. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమా ఎలా ఉంది? ఏంటనేది ఇప్పుడు రివ్యూలో చూద్దాం.

వెంకట్ (కార్తికేయ) చిన్నప్పుడే తల్లిదండ్రులు అప్పుల బాధతో చనిపోతారు. అనాథగా మారిన ఇతడిని, తండ్రి స్నేహితుడు (తనికెళ్ల భరణి) దత్తత తీసుకుంటాడు. తన సొంత కొడుకు వెంకట్ (రాహుల్ టైసన్)లానే వెంకట్‌ని కూడా పెంచి పెద్ద చేస్తాడు. సిటీలో అద్దె ఇంట్లో ఉండే అన్నదమ్ములిద్దరూ.. ఉద్యోగాలు చేస్తున్నామని చెప్పి తండ్రిని మోసం చేస్తుంటారు. ఓ రోజు తండ్రి ఆరోగ్యం విషమించడంతో డబ్బుల కోసం వెంకట్ బెట్టింగ్ వేస్తాడు. అందులో గెలుస్తాడు. కానీ విలన్ గ్యాంగ్ ఇతడిని మోసం చేస్తారు. దీంతో ఊహించని పరిస్థితుల్లో వాళ్లపై పగ తీర్చుకోవాల్సి వస్తుంది. మరి చివరకు ఏమైంది? వెంకట్ తాను అనుకున్నది సాధించాడా? లేదా? ఇతడితో డేవిడ్ (రవి శంకర్), జార్జ్ (శరత్ లోహిత్స్వ)కి సంబంధమేంటి? అనేదే మెయిన్ స్టోరీ. 'భజే వాయు వేగం' గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే బెట్టింగ్స్‌లో గెలుస్తూ బతికేసే ఓ మిడిల్ క్లాస్ కుర్రాడు.. ఊహించని విధంగా కెరీర్, వ్యక్తిగత, రాజకీయ పరంగా సమస్యల్లో ఇరుక్కుని ఎలా గెలిచి నిలబడ్డాడు అనేదే కథ. ఓవరాల్‌గా చూస్తే డీసెంట్ క్రైమ్ థ్రిల్లర్. కథ పరంగా చూస్తే కొన్ని సీన్స్ ఊహించేలా ఉన్నప్పటికీ, స్క్రీన్ ప్లే బాగుంది. పెద్దగా ల్యాగ్ చేయకుండా వచ్చిన సీన్స్ టైటిల్‌కి తగ్గ న్యాయం




చేశాయి. ఫస్టాఫ్ విషయానికొస్తే.. పోలీస్ స్టేషన్‌లో హీరో అరెస్ట్ అయి ఉండే సీన్‌తో మూవీ మొదలైంది. ఆ తర్వాత ఏడాది వెనక్కి వెళ్లి.. హీరో గతమేంటి? అతడి చుట్టూ ఉండే వాతావరణం ఏంటనేది చూపించారు. స్టోరీ సెటప్ కోసం ఫస్టాఫ్ అంతా ఉపయో గించుకున్నారు. కానీ హీరోహీరోయిన్ లవ్ ట్రాక్ పరమ రొటీన్‌గా అనిపించింది. రెండు పాటలు ఓకే గానీ హీరోహీరోయిన్ మధ్య కెమిస్ట్రీ అస్సలు వర్కౌట్ కాలేదు. ఓ మాదిరిగా వెళ్తున్న మూవీ కాస్త ఇంటర్వెల్ వచ్చేసరికి ఆసక్తికరంగా మారింది. అక్కడి నుంచి చివరివరకు చాలా బాగా తీశారు. కానీ క్లైమాక్స్ మాత్రం రెగ్యులర్ కమర్షియ ల్ ఫార్మాట్‌లో ముగించారు. ఆర్‌ఎక్స్ 100'తో చాలా ఫేమ్ తెచ్చుకున్న కార్తికే య.. ఆ తర్వాత మాత్రం సరైన హిట్ పడక ఎదురుచూపులు చూస్తున్నాడు. 'భజే వాయువేగం' అతడికి హిట్ ఇచ్చినట్లే! బాధ, ప్రతీకారం లాంటి ఎమోషన్స్ బాగా పలికించాడు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# తండ్రిని, తమ్ముడిని చంపి..

## శరీరాలను ముక్కలుగా నరికిన 15 ఏండ్ల బాలిక

### ఫ్రిజ్‌లో దాచిన 15 ఏండ్ల బాలిక.. ప్రేమ కోసం ఘాతుకం

తన ప్రేమకు అడ్డుపడుతున్నారన్న కోపంతో పదో తరగతి చదువుతున్న 15 ఏండ్ల బాలిక తండ్రి, సోదరుడిని అత్యంత దారుణంగా హత్యచేసింది. అనంతరం వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా నరికి వాటిని ఫ్రిజ్‌లో దాచిపెట్టింది. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘాతుకానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఆ బాలికను రెండున్నర నెలల తర్వాత పోలీసులు హరిద్వార్‌లో అరెస్ట్ చేశారు. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో చోటు చేసుకుంది. రైల్వేలో క్లర్క్‌గా పనిచేసే రాజ్‌కుమార్ విశ్వకర్మ కుమార్తె అయిన ఈ బాలిక ముకుల్ సింగ్ (19) అనే యువకుడితో ప్రేమలో పడి గత ఏడాది అతనితో వెళ్లిపోయింది. దీంతో అతడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. తమ ప్రేమ ఫలించాలంటే తన తండ్రిని అడ్డు తొలగించుకోవడం ఒక్కటే మార్గమని ఆ బాలిక నిర్ణయించుకుంది. దీంతో ఇద్దరూ హత్యకు పథకం వేశారు. అనుకున్నట్టుగానే బ్లేడ్‌తో కోసి రాజ్‌కుమార్‌ను హత్య చేశారు. అదే సమయంలో నిద్రలోంచి లేచిన తొమ్మిదేళ్ల బాలిక సోదరుడిని సుత్తితో మోదీ హతమార్చారు. తర్వాత మృతదేహాలను ముక్కలుముక్కలుగా నరికి వాటిని ఫ్రిజ్‌లో ఉంచి పరారయ్యారు. కాగా, బాలిక హరిద్వార్‌లో పట్టుబడగా, ముకుల్ మాత్రం ఇంకా పరారీలోనే ఉన్నాడు.



# పదో ప్రయత్నంలో టెన్త్ క్లాస్ పాస్!

మహారాష్ట్రలోని బీడ్‌కు చెందిన కృష్ణ నాందేవ్ ముండేను అభినవ విక్రమార్కుడిగా నెటిజన్లు కీర్తిస్తున్నారు. దీనికి కారణం ఏంటంటే.. అతను పదో తరగతి పాసయ్యేందుకు అవిశ్రాంత పోరాటమే చేశాడు. 2018 నుంచి 2024 వరకు వరుసగా పదిసార్లు టెన్త్ క్లాస్ పరీక్షలు రాశాడు. చివరికి ఈ ఏడాది పదో ప్రయత్నంలో అతను పది పాసయ్యాడు. దీంతో గ్రామస్థులందరూ బ్యాండుమేళంతో అతడిని ఊరేగించి వేడుక చేశారు.

# శృంగార తార కేసులో

# దోషిగా తేలిన ట్రంప్



అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషిగా తేలారు. శృంగార తార స్టార్మీ డేనియల్‌తో అక్రమ సంబంధం కేసులో ఆయనపై నమోదైన అన్ని ఆరోపణలు రుజువైనట్లు న్యూయార్క్ కోర్టు తేల్చింది. దాదాపు 34 అంశాల్లో ఆయనను దోషిగా నిర్ధరించింది. ఇలా ఓ కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడు ట్రంపే కావడం గమనార్హం. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన బైడెన్‌తో తలపడనున్న విషయం తెలిసిందే. మరో ఐదు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ తీర్పు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఆరోపణలేంటి?**

స్టార్మీ డేనియల్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ట్రంప్ పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్పారని అభియోగాల్లో పేర్కొన్నారు. తన న్యాయవాది ద్వారా ఆమెకు సొమ్ము ఇప్పించారని తెలిపారు. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని పేర్కొన్నారు. అందుకోసం బిజినెస్ రికార్డులన్నింటినీ తారుమారు చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఇలా మొత్తం 34 అంశాల్లో ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. సుదీర్ఘ విచారణ అనంతరం అవన్నీ నిజమేనని తాజాగా కోర్టు తేల్చింది. ట్రంప్‌తో అక్రమ సంబంధం వాస్తవమేనని స్టార్మీ డేనియల్స్ స్వయంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన సంగతి తెలిసిందే.

**జైలుకెళ్లాల్సిందేనా?**

దోషిగా తేలడంతో ట్రంప్ జైలుకెళ్లాల్సిందేనా అనే ప్రశ్న అందరిలో తలెత్తుతోంది. దీనికి కచ్చితమైన సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. జులై 11న ఆయనకు కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. బిజినెస్ రికార్డులు తారుమారు చేయడమనేది న్యూయార్క్‌లో తక్కువ తీవ్రత ఉన్న నేరంగా పరిగణిస్తారు. గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. దీనిపై పూర్తి విచక్షణాధికారం న్యాయమూర్తిదే. కచ్చితంగా జైలు శిక్ష విధిస్తారని కూడా చెప్పలేమని అక్కడి న్యాయ నిపుణులు వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకవేళ జైలు శిక్ష కాకపోతే జరిమానా కూడా విధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇంతకంటే తీవ్రమైన మరో మూడు కేసుల్లోనూ ట్రంప్ అభియోగాలు ఎదుర్కొంటుండడం గమనార్హం. అవేవీ ఎన్నికల ముందు విచారణకు వచ్చే అవకాశం లేదని ఆయన న్యాయవాదుల బృందం ధీమాగా ఉంది.

**ఎన్నికల్లో పోటీ పరిస్థితేంటి?**

తాజా కోర్టు తీర్పుతో ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదని న్యాయనిపుణులు తెలిపారు. నేరారోపణలు రుజువైతే ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలగాలనే నిబంధనేమీ లేదని వెల్లడించారు. 1920లో ఓ సోషలిస్ట్ నేత జైలులో ఉండే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేశారని కొందరు గుర్తుచేశారు. తాజాగా ట్రంప్ సైతం యథావిధిగా ప్రచారం కొనసాగించొచ్చని వెల్లడించారు. దోషిగా తేలి గృహ నిర్బంధానికి పరిమితమైతే ట్రంప్ వర్చువల్‌గా ప్రచారం చేపడతారని ఆయన కోడలు, రిపబ్లికన్ నేషనల్ కమిటీ కో-ఛైర్ లారా ట్రంప్ వెల్లడించారు. ఇప్పటికే అక్కడి ఓటర్లు రెండువర్గాలుగా చీలిపోయినట్లు విశ్లేషకులు అంచనా వేశారు. ఈ తరుణంలో తాజా తీర్పు ఎన్నికలపై ఏ మేరకు ప్రభావం చూపుతుందనేది చెప్పలేమన్నారు.



# మురికివాడల నుంచి ప్రపంచకప్‌నకు

టీ20 ప్రపంచకప్‌లో ఉగాండా తరపున ఆడుతున్న జుమా మియాగి గురించి ప్రత్యేకంగా చెప్పకోవాల్సిందే. ఉగాండా రాజధాని కంపాలా శివారులోని నాగురు మురికివాడకు చెందిన 21 ఏళ్ల మియాగి ఇప్పటివరకూ 21 అంతర్జాతీయ టీ20ల్లో 34 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికీ కుటుంబంతో కలిసి అతడు మురికివాడల్లోనే ఉంటున్నాడు. ప్రపంచకప్‌లో ఉగాండా తమ తొలి మ్యాచ్‌ను సోమవారం అఫ్గానిస్థాన్‌తో ఆడుతుంది.



# ఢిల్లీలో నీటి కష్టాలు.. సుప్రీంకోర్టుకు ఆప్

ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఢిల్లీకి నెల రోజుల పాటు అదనపు నీటిని అందించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎండల తీవ్రతతో ఢిల్లీకి నీటి అవసరం పెరిగిందని, దేశ రాజధాని అవసరాలను తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిటిషన్‌లో పేర్కొంది.



# ఎట్టకేలకు జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జర్మనీ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రజ్వల్‌ను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత నడుమ విచారణ నిమిత్తం సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఎన్డీయే కూటమి తరఫున హాసన పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేశారు. అయితే పలువురు మహిళలపై ఆయన లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. దీంతో గత ఏప్రిల్‌లో ఆయన దేశం విడిచి పారిపోయారు. ఇప్పటివరకు ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి.



# ప్రాణాలు పీల్చేస్తున్న పొగాకు

పొగాకు ఉత్పత్తి, వినియోగంలో చైనాదే అగ్రస్థానం. అక్కడ సుమారు 30 కోట్ల మంది పొగాకు ఉత్పత్తులు వాడుతున్నారని అంచనా. ఆ తరవాత 27శాతం వినియోగదారులతో భారత్ రెండో స్థానంలో నిలుస్తోంది. ప్రపంచంలో ప్రతి వంద అర్ధాంతర మరణాల్లో పదింటికి పొగాకు వాడకమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చింది. భారత్‌లో వివిధ కారణాలతో ఏటా పది లక్షల మంది అర్ధాంతరంగా మరణిస్తున్నారు. వీరిలో 3.5 లక్షల మంది పొగాకు బాధితులే. పొగాకు వల్ల 25 రకాల క్యాన్సర్లు వస్తున్నాయి.




# భారీ లాభాల్లో మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఆరంభంలోనే భారీ లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూలతలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. గతకొన్ని రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 525 పాయింట్ల లాభంతో 74,410 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 130 పాయింట్లు లాభపడి 22,619 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.23 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఇన్ఫోసిస్, మారుతీ మినహా మిగిలిన షేర్లన్నీ లాభాల్లో ఉన్నాయి. ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడుతున్న జాబితాలో ఉన్నాయి.




## అందరి కండ్లు

# ఇండియా vs పాక్ పోరుపైనే..!

మొదటిసారి ఐసీసీ ప్రపంచకప్ టోర్నీలో ఆడే అవకాశంతో పాటు ఆతిథ్య హక్కులను పొందిన అమెరికా. దానికి ఆనుకుని ఉన్న కెనడా. పై రెండు దేశాల మాదిరిగానే సరిహద్దులు పంచుకుంటున్న దాయాదులు భారత్, పాకిస్థాన్. తమదైన రోజున సంచలనాలు నమోదుచేసేందుకు సిద్ధమైన ఐర్లాండ్. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్- ఏలో ఐదు జట్లు ఉన్నప్పటికీ అందరి కండ్లు జూన్ 9న జరుగబోయే దాయాదుల పోరు మీదే!

**ఉనికి చాటుకుంటే డబుల్ హ్యాపీ..**

తొలిసారి ఐసీసీ ట్రోఫీ బరిలో నిలిచిన అమెరికాపై అంచనాలు లేకపోయినప్పటికీ గ్రూప్ దశలో ఒక్క విజయం నమోదు చేసినా, ప్రత్యర్థులకు కనీసం పోటీనిచ్చినా అది ఆ జట్టుతో పాటు అగ్రరాజ్యాన క్రికెట్‌కూ మంచి చేసేదే. ఇటీవలే 2-1తో బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నెగ్గడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కోరె అండర్సన్, నిసర్గ పటేల్, స్టీవెన్ టేలర్ వంటి స్టార్లు ఉన్న అమెరికా.. సొంత ప్రేక్షకుల నడుమ ప్రత్యర్థులకు పోటీనివ్వాలని తహతహలాడుతోంది.



# ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి!

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, గవర్నమెంట్ స్కూళ్ల పరిధిలో ఉన్న 15,640 కేంద్రాలను ప్రీస్కూల్స్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తోంది. వాటి ఆధునికీకరణకు రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆయా కేంద్రాలకు రంగులు, పిల్లలకు ప్రత్యేక యూనిఫామ్స్, బుక్ రాక్స్, పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 6 తర్వాత ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

# ఓటీటీలోకి వచ్చేసింది




చాలా కాలం తర్వాత హీరో అల్లరి నరేష్ నటించిన కామెడీ ఎంటర్టైనర్ ఆ ఒక్కటి అడక్కు. ఒకప్పుడు కామెడీ కథలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన నరేశ్.. ఆ తర్వాత విభిన్నమైన కథలను ఎంచుకుంటున్నారు. సీరియస్ యాక్షన్ సినిమాలు.. వైవిధ్యమైన కంటెంట్ కథలను సెలక్ట్ చేసుకుంటూ నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఇట్లు మారెడుపల్లి ప్రజానీకం, ఉగ్రం, నాంది వంటి యాక్షన్ చిత్రాలతో అలరించాడు నరేశ్. ఇక ఇప్పుడు తన మార్క్ కామెడీతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చాడు. మల్లి అంకం దర్శకత్వం వహించిన ఈ సినిమాను రాజీవ్ చిలక నిర్మించారు. ఇందులో జాతిరత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా.. వెన్నెల కిశోర్, వైవా హర్ష కీలకపాత్రలు పోషించారు. మే 3న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వచ్చాయి. కానీ ఆశించిన స్థాయిలో కమర్షియల్ హిట్ కాలేకపోయింది. కామెడీ పరంగా అలరించినా.. అంతగా వసూళ్లు రాబట్టలేకపోయింది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ సినిమా స్టోరీ విషయానికి వస్తే వయసు పెరిగిన అబ్బాయి పెళ్లి కోసం పడే తంటాలను ఈ చిత్రంలో చూపించారు. పెళ్లి చేసుకోవడానికి హీరో పడే కష్టాలు, మాట్రిమోని సైట్స్ ను కలవడం.. అందులో వారు చేసే మోసాలను కళ్లను కట్టినట్లుగా చూపించారు. ఇక ఇందులో మరోసారి తన నటనతో ఆకట్టుకుంది ఫరియా అబ్దుల్లా.